
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శనివారం 23 నవంబరు 2024



నేడు, రేపు ఓటరు నమోదు ప్రక్రియ

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శని, ఆది వారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. అలాగే ఒక నియోజకవర్గం నుంచి వేరొక నియోజకవర్గానికి పేరు మార్చుకునేందుకు వీలుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలు, సమాచారం కోసం బూత్ లెవల్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

- ఒకరి అవయవాల దానంతో 8 మందికి పునర్జన్మ
- దాతలు ముందుకు రావాలి
- జిల్లాలో అంతంత మాత్రమే స్పందన
- అధికారులు అవగాహన కల్పిస్తేనే సత్ఫలితాలు

కన్ను తెరిస్తే జననం.. కన్నుమూస్తే మరణం. కానీ అవయవ దానం ఇచ్చి మరొకరికి పునర్జన్మ ఇవ్వొచ్చు. తాను తనువు చాలించినా.. మరో నాలుగు కుటుంబాల్లో వెలుగులు నింపి చిరంజీవులు అవ్వొచ్చు. మరణించినా మరికొందరిలో జీవించి ఉండడమే అవయవదానం గొప్పతనం. దీనిపై అవగాహన లేక చాలామంది స్వచ్ఛందంగా అవయవదానం చేసేందుకు ముందుకురావడం లేదు. ఎవరైనా ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయిన సందర్భాల్లో వారి కుటుంబ సభ్యులను ఒప్పించి అవయవాలను సేకరిస్తున్నారు. ఈ పరిస్థితి మారాలంటే అవయవదానంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది.



మరణించినా.. జీవించు!

ఈ నెల 20న గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన గంటి పల్లవి అనే పదేళ్ల చిన్నారి రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యసేవలందించినా ఫలితం లేకపోయింది. బ్రెయిన్ డెడ్ కావడంతో చికిత్సకు వీలుకాలేదు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సమ్మతించడంతో జీవన్‌దాన్ ద్వారా అవయవదానం చేసింది ఆ చిన్నారి. మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపింది.

ఈ నెల 12న పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయికుమార్ అనే యువకుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో వెంటనే విజయనగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అయితే బ్రెయిన్ డెడ్ కావడంతో చికిత్స చేసినా ఫలితం ఉండదని వైద్యులు తేల్చారు. దీంతో తల్లిదండ్రులు అవయవదానానికి ముందుకొచ్చారు. ఈ నెల 14న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా గ్రీన్‌చానల్ ద్వారా యువకుడి గుండెను విశాఖ నుంచి విమానంలో చెన్నై చేర్చారు. కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో భద్రపరిచారు.

రేగిడి ఆమదాలవలస మండలంలోని సుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మడపల పెంటయ్య అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆయన బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానానికి కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. ఆయన అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా విశాఖ నుంచి చెన్నైకి తరలించారు.



విజయనగరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిలో కొందరు బ్రెయిన్ డెడ్‌కు గురవుతారు. అటువంటి వారి అవయవాలను కుటుంబసభ్యులు దానం చేయవచ్చు. జీవన్‌దాన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వమే గ్రీన్ చానల్ ద్వారా వాటిని తరలించే ఏర్పాటు చేస్తుంది. అందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

ఎనిమిది మందికి పునర్జన్మ

సాధారణంగా ఒక వ్యక్తి అయవదానం చేస్తే ఎనిమిది మందికి వాటిని అమర్చవచ్చు. అవయవాలన్నీ సరిగ్గా ఉంటేనే అది సాధ్యపడుతుంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె, గుండె కవటాలు, పేగులు, క్లోమం, కార్నియా వంటివి సేకరించి మరొకరికి అమర్చవచ్చు. చాలామంది అనారోగ్యానికి గురై, అవయవాలు సరిగా పనిచేయక ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంటారు. అవయవాలు సమకూరక చాలామంది మృత్యువాత పడుతుంటారు. అటువంటి వారికి అవయవదానం పునర్జన్మనిస్తుంది. అయితే అవయవదానంపై ఇంకా ప్రజల్లో అవగాహన పెరగడం లేదు. అటు రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో చాలామంది బ్రెయిన్ డెడ్ అవుతుంటారు. అటువంటి వారిని గుర్తించి, కుటుంబసభ్యులను ఒప్పించగలిగితే మరికొందరి ప్రాణాలను నిలబెట్టవచ్చు. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. దానిని అదనపు భారంగా పరిగణిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా అదే పరిస్థితి.

ప్రత్యేక చట్టాలు..

1994లో తొలిసారిగా మనదేశంలో అవయవ, కణాల మార్పిడి చట్టాన్ని తీసుకొచ్చారు. 2011లో దానికి సవరణలు చేశారు. అవయవాల సేకరణ, తరలింపు, కేటాయింపు వంటివి జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్‌వోటీటీవో) పర్యవేక్షిస్తోంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జీవన్ దాన్, ఇండియన్ రెడ్‌క్రాస్ వంటి సంస్థలు బాధ్యతలను చూస్తున్నాయి. దశాబ్దాలుగా మెరుగైన సేవలందిస్తున్నాయి. జిల్లాలో అవయవదా నంపై విస్తృత అవగాహన పెరగాల్సి ఉంది. మరణం తరువాత అవయవదానం చేస్తామని (మిగతా 8వ పేజీలో..)



అవయవాలను విశాఖకు తరలిస్తున్న దృశ్యం



పల్లవి (ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలిక
- బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారణ
- అవయవదానానికి తల్లిదండ్రులను ఒప్పించిన వైనం
- గ్రీన్ చానల్ ద్వారా విశాఖకు అవయవాల తరలింపు

అవయవదాతా.. వర్ధిల్లు!

విజయనగరం/గంట్యాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారి జీవించి లేకపోయినా తాను చేసిన అవయవదానంతో మరికొందరికి పునర్జన్మనిచ్చింది. ఒకవైపు కుమార్తె మృతి.. మరోవైపు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిదండ్రులతో ఆ కుటుంబం పడుతున్న బాధ వర్ణనాతీతం. అంతటి పుట్టెడు దుఃఖంలో కూడా ఆ దంపతులు తన గారాల పట్టి అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. వారిని ప్రతిఒక్కరూ అభినందించారు. చిన్నారి మృతదేహాన్ని చూసి ప్రజలు, స్నేహితులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. కదలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులు అంబులెన్స్‌లో ఉండి తమ కుమార్తెను కడసారి చూసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. గంటాడ్య మండలం మురపాక గ్రామానికి చెందిన గండి వెంకటరమణ, దేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వెంకటరమణ తన భార్య, చిన్న కూతురు పల్లవి(13)తో కలిసి ఈ నెల 20న తాటిపూడి రిజర్వాయర్ అవల ఉన్న ఎగువ కొండపర్తి వెళ్లారు. అక్కడి వైకుంఠగిరి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ద్విచక్రవాహనంపై తిరుగుప్రయాణ మయ్యారు. ఎస్ఆర్ పురం వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో దంపతుల కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పల్లవి బ్రెయిన్ డెడ్ అయ్యిందని, బతికే అవకాశాలు తక్కువని డాక్టర్లు చెప్పారు. పాప అవయవాలను దానం చేస్తే మరోనలుగురికి ఉపయోగపడి, వారికి జీవితాన్ని ఇచ్చినట్లు అవుతుందని తల్లిదండ్రులకు బంధువులు, డాక్టర్లు (మిగతా 8వ పేజీలో..)

నీకది.. నాకిది..

- ఊళ్లు పంచుకుంటున్న మద్యం వ్యాపారులు
- బెల్టుషాపులకు యథేచ్ఛగా సరఫరా
- ఎక్సైజ్ సిబ్బందికి నెలవారీ ముడుపులు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

మెంటాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల యజమానుల్లో చాలామంది ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. సిండికేట్‌గా మారి బెల్టు షాపులను ఏరియాల వారీగా పంచుకొని మద్యం సరఫరా చేస్తున్నారు. సిండికేట్‌లో చేరేందుకు ఆసక్తి చూపనివారిపైకి తమకు తెలిసిన ఎక్సైజ్ అధికారులను ఉసిగొల్పి దారికి తెచ్చుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వ్యవహారం పెద్ద దుమారాన్ని రేపుతోంది. కొత్త మద్యం పాలసీ నేపథ్యంలో జిల్లాలో 153 ప్రైవేటు వైన్ షాపులు ఏర్పాటయ్యాయి. మండలం యూనిట్‌గా దుకాణాల కేటాయింపు జరిగింది. దీంతో షాపులు దక్కించుకున్న వారు, వ్యాపారానికి అనుకూలమైన ఏరియాలను గుర్తించి ఆయాచోట్ల షాపులు ప్రారంభించారు. మద్యం షాపుల్లో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం గట్టి నిఘా పెట్టింది. నిబంధనలు బేఖాతరు చేస్తూ ఏ చిన్న తప్పునకు పాల్పడినా కఠిన చర్యలకు వెనుకాడేది లేదని హెచ్చరిస్తుంది. ముఖ్యంగా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తే మొదటిసారి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని, రిపీట్ అయితే లైసెన్స్ రద్దు చేస్తామని తేల్చిచెబుతుంది. అయితే, 75 శాతం మద్యం షాపుల యజమానులు ప్రభుత్వ ఆదేశాలను తేలిగ్గా తీసుకుంటున్నారు. మండలాల్లోని గ్రామాలను, ఆ మండలానికి మంజూరైన షాపుల సంఖ్యను బట్టి వాటాలు వేసుకొని బెల్టు షాపులకు మద్యం సరఫరా మొదలుపెట్టారు. వీరి సిండికేట్‌లో చేరేందుకు ఇష్టపడని 25 శాతం మంది యజమానులను పలు విధాలుగా బెదిరిస్తున్నట్లు సమాచారం. వీరికి కొంతమంది ఎక్సైజ్ సిబ్బంది సహకరిస్తున్నారని వినికిడి. దీనివల్ల గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఒక బెల్టు షాపు యజమాని నుంచి ఎక్సైజ్ సిబ్బందికి నెలవారీ రూ.1500 మామూళ్లు ముడుతున్నట్టు తెలిసింది. ఇవ్వని వారిపై దాడులు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్



గజపతినగరం: మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

గజపతినగరం/దత్తిరాజేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి బెల్టుషాపులు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా గజపతినగరం, దత్తిరాజేరు మండలంలోని బూర్జవలస పోలీసు స్టేషన్లను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించి బెల్టుషాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. 'గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటాం. చెక్ పోస్టుల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించడంతో గంజాయి అక్రమ రవాణా కొంత తగ్గుముఖం పట్టింది. గంజాయి విక్రయాలతో ఆస్తులు సంపాదించినట్లు గుర్తిస్తే వాటిని జప్తు చేస్తాం. మాదక ద్రవ్యాల నియంత్రణకు సంకల్పం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ బాధితులు తక్షణమే 1930కి గానీ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేయాలి. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు తరచూ లాడ్జీలను తనిఖీ చేయాలి. ప్రస్తుతం జిల్లాలో 15 శాతం సిబ్బంది కొరత ఉంది. త్వరలో నియామకాలు చేపట్టనున్నందున సిబ్బంది కొరత తీరనుంది. జిల్లాలో 230 మందికి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ పూర్తిచేశాం. జిల్లా వ్యాప్తంగా 43 బ్లాక్ స్పాట్స్ గుర్తించాం. ప్రమాదాల నియంత్రణకు సూచనలు చేసి, ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించాం.' అని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ రమణ, ఎస్ఐలు లక్ష్మణరావు, రాజేష్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలు తెరిచేనా?

- సారిపల్లి పారిశ్రామికవాడలో నిస్తేజం
- గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

నెల్లిమర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలోని సారిపల్లి పారిశ్రామిక వాడలో ఒకప్పుడు వంద పరిశ్రమలు ఉండేవి. ఆ ప్రాంతం కార్మికులతో నిత్యం కళకళలాడేది. కానీ, ప్రభుత్వాల ప్రోత్సాహం లేక.. నిర్వహణ భారంగా మారి ఒక్కో పరిశ్రమ మూతపడుతూ వస్తోంది. ఇప్పటివరకూ దాదాపు 50కుపైగా పరిశ్రమలు మూతపడ్డాయి. కార్మికులతో పాటు వారి కుటుంబాలు వీధినపడ్డాయి. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సారిపల్లి పారిశ్రామికవాడలో నిస్తేజం నెలకొంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పరిశ్రమల ఏర్పాటుపై దృష్టిపెట్టింది. ప్రతి నియోజకవర్గంలో చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు సైతం ప్రోత్సాహం అందిస్తామని చెబుతోంది. దీంతో సారిపల్లి పారిశ్రామిక వాడపై ఆశలు చిగురిస్తున్నాయి.

30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు

మూడు దశాబ్దాల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో సారిపల్లి వద్ద దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక వాడను నెలకొల్పారు. తోలు, ఐరన్, సింథటిక్, పైపులు, ఆయిల్, చెప్పులు, స్టీలు, గృహోపకరణాలు, ఐస్ క్రీమ్‌లు, పేపర్ కోన్‌లు, పండ్ల రసాల తయారీ వంటి 60 రకాల పరిశ్రమలను ఏర్పాటు చేశారు. 30 వేల మంది కార్మికులు ఇక్కడి పరిశ్రమల్లో ఉపాధి పొందేవారు. ప్రధానంగా తోలు, జోళ్ల ఉత్పత్తులకు సారిపల్లి పారిశ్రామిక వాడ పెట్టింది పేరు. ఉత్తరాంధ్ర నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడి నుంచి సరుకును కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. ఏడాది పొడవునా కార్మికులకు మెరుగైన ఉపాధి లభించేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పారిశ్రామికవాడలో పరిశ్రమలకు రాయితీలు, రుణాలు వర్తింపజేసేవి. అయితే రానురాను పరిశ్రమల నిర్వహణ యాజమాన్యాలకు కష్టంగా మారింది. దీంతో నష్టాలను సాకుగా చూపి వాటిని మూసివేశారు. గతంలో 60 పరిశ్రమల్లో క్రయవిక్రయాలు ఉత్పత్తులు జరిపేవి. కానీ ప్రస్తుతం పట్టుమని పది పరిశ్రమలు కూడా లేవు. దీంతో పారిశ్రామిక వాడలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. కొద్దిరోజులుగా నిర్వహణ లేక ముళ్ల, చెత్త, పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. చూడడానికి వీలులేని స్థితిలోకి పారిశ్రామిక వాడ చేరుకుంది.



మూతపడిన పరిశ్రమ

గుర్తించని అధికారులు..

ప్రతి నెల పారిశ్రామిక రంగంపై కలెక్టర్ సమీక్షిస్తున్నారు. పరిశ్రమల పురోగతిపై చర్చిస్తున్నారు. కానీ, జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని సారిపల్లి పారిశ్రామిక వాడ గురించి చర్చించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక వాడలో అన్నిరకాల వసతులు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం కొన్ని రకాల రాయితీలు ప్రకటిస్తే పరిశ్రమల ఏర్పాటుకు చాలామంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చే అవకాశముంది.

పరిశ్రమలను తెరిపించాలి

సారిపల్లి పారిశ్రామిక వాడలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి. ఇక్కడ ఎంతో మంది కార్మికులకు ఉపాధి దొరికేది. కానీ పరిశ్రమలకు ప్రోత్సాహం లేక మూతపడ్డాయి. గతంలో టీడీపీ హయాంలోనే పారిశ్రామికాభివృద్ధికి అడుగులు పడ్డాయి. వైసీపీ సర్కారు మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో ఆశలు చిగురిస్తున్నాయి.

- కె.అప్పలస్వామి, కార్మికుడు, నెల్లిమర్ల

నిర్వహణ భారంతో..

పరిశ్రమల నిర్వహణ కష్టంగా మారడం వల్లే మూసి వేస్తున్నట్టు యాజమాన్యాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో గత ఐదు సంవత్సరాలుగా తెరిపించే ప్రయత్నం చేయలేదు. ప్రధానంగా ముడి సరుకు ధర పెరిగిపోవడం, లభ్యత లేకపోవడం, మార్కెటింగ్, రవాణా సౌకర్యం లేకపోవడమే పరిశ్రమల మూతకు కారణమని తెలుస్తోంది. ప్రధానంగా విద్యుత్ చార్జీలు అమాంతం పెరిగిపోయాయి. గత ప్రభుత్వాలు పరిశ్రమలకు రాయితీపై విద్యుత్ సరఫరా చేసేవి. యూనిట్ ప్రాతిపదికన రాయితీ వర్తింపజేసేవి. కానీ తరువాత రాయితీలను ఎత్తివేసిన వైసీపీ ప్రభుత్వం ఏకంగా యూనిట్ కాస్ట్‌ను అమాంతం పెంచేసేంది. ప్రస్తుత యూనిట్‌కు రూ.15 పై మాటే. అటు ముడి సరుకుల లభ్యత కూడా లేదు. ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడం లేదు. కరోనా తరువాతే చాలా పరిశ్రమలు మూతపడినట్లు స్థానికులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ పారిశ్రామిక వాడను మరింతగా అభివృద్ధి చేసి కార్మికులకు ఉపాధి పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ గత ఐదేళ్లలో ఇక్కడ ఒక పారిశ్రామిక వాడ ఉందన్న విషయాన్ని మరిచిపోయారు. కనీసం పరిశ్రమలు ఎందుకు మూతపడుతున్నయో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు.

'విజ్జీ'కి మంచి రోజులొచ్చేనా?

6లో

- ఇండోర్ స్టేడియం నిరుపయోగం
- అసంపూర్తిగా టెన్నిస్ క్లే కోర్టు
- సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు అధ్వానం



అన్నదాతల్లో అలజడి

- చివరి దశలో వరి పంటకు తెగుళ్లు
- మరోవైపు తుఫాన్ హెచ్చరికలు
- పంటను రక్షించుకోవడానికి పాట్లు

6లో



ఆ సంతతో అనుబంధం కొండంత!

- సీతంపేట సంతకు ఎంతో ప్రత్యేకత
- ఆదివారం అర్ధరాత్రి నుంచే విక్రయాలు
- సౌకర్యాలకు దూరం

6లో



ఆ సంతతో అనుబంధం కొండంత

- సీతంపేట సోమవారం సంతకు ఎంతో ప్రత్యేకత
- ఆదివారం అర్ధరాత్రి నుంచే విక్రయాలు
- సౌకర్యాలకు మాత్రం దూరం



అర్ధరాత్రి సీతంపేట వారపు సంతలో అరటి గెలలు విక్రయిస్తున్న గిరిజనులు

ఆదివాసీలది సీతంపేట సంతతో ప్రత్యేక అనుబంధం. ప్రతి సోమవారం జరిగే ఈ సంత వారి ఉత్పత్తుల విక్రయానికి.. అవసరాలను తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతోంది. మైదాన ప్రాంతా వ్యాపారులకూ ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది. సుమారు 70 ఏళ్లుగా సాగుతున్న ఈ సంత.. ఏజెన్సీ ప్రాంతంలోనే అతిపెద్దది. కొండ ప్రాంతాల్లో పండే అనేక ఉత్పత్తులకు ప్రధాన మార్కెట్ ఇదే.

సీతంపేట రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ ప్రాంతాల్లో వారపు సంతలది ప్రత్యేక స్థానం. తరతరాలుగా వారపు సంతలపై ఆధారపడి ఆదివాసీలు జీవిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అతి పెద్ద వారపు సంత సీతంపేటలో ప్రతి సోమవారం జరుగుతుంది. ఇక్కడికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో తమ ఉత్పత్తులను తీసుకొస్తుంటారు. వీటిని కొనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున వస్తారు. గతంలో సీతంపేటలో వారపుసంత ఒక్క సోమవారం మాత్రమే జరిగేది. కానీ ప్రస్తుతం ఆదివారం ఉదయం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు సంత కొనసాగుతూ ఉంటుంది. సీజనల్ పంటలు లభించే రోజుల్లో ఈ సంత గిరిజన రైతులు, వ్యాపారులతో కిక్కిరిసిపోతుంది. సీతంపేటతో పాటు కుసిమి, దోనుబాయి, మర్రిపాడు ప్రాంతాల్లో సంతలు జరుగుతుంటాయి. వీటిలో సోమవారం సీతంపేటలో జరిగే వారపు సంతే పెద్దదిగా చెప్పవచ్చు.

చలికాలంలో తప్పని ఇబ్బందులు..

గిరిజన ఉత్పత్తులను సేకరించి వాటిని విక్రయించేందుకు గిరిజనులు వారపు సంతల పై ఆధార పడుతుంటారు. మన్యం ప్రాంతంలో ప్రధానంగా జీడి మామిడి, కొండచీపుర్లు, పెండ్లం, గుమ్మడి కాయలు, అరటి పండ్లు, నారింజ, బత్తాయి, సీతాఫలం, పైనాపిల్ వంటి ఉత్పత్తులను సేకరించి వారపు సంతల్లో విక్రయిస్తారు. ఇలా విక్రయించగా వచ్చే మొత్తంతో వారానికి సరిపడా నిత్యవసర సరుకులను సంతల్లో కొనుగోలు చేసుకొని ఇళ్లకు వెళతారు. ఈ సంతకు వర్షాకాలం, శీతాకాలంలో వచ్చే గిరిజనులు, వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతుంటారు. అర్ధరాత్రి నుంచే సంత మొదలవ్వడంతో వర్షంలో తడుస్తూనే ఉత్పత్తులను విక్రయించక తప్పని పరిస్థితి. శీతాకాలంలో చలి ఎక్కువగా ఉండడంతో సంతల కోసం నిర్మించిన షెడ్డులోనే తలదాచుకొని తెల్లవారే వరకు వేచి చూస్తారు. చలి నుంచి కాపాడుకునేందుకు మంటలు వేసుకొని రాత్రంతా ఉంటారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ ఫుట్‌పాత్‌లపైనే వీరంతా గడుపుతారు.

ఏడు దశాబ్దాలుగా...

సీతంపేట సంతది సుమారుగా 70 ఏళ్ల చరిత్ర. ఇక్కడికి స్థానికంగా ఉన్న వారితో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, భువనేశ్వర్, కటక్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఎక్కువగా వస్తుంటారు. సీజన్‌లో వారపు సంతకు వచ్చే గిరిజన ఉత్పత్తులు, పంటలు ఆధారంగా చేసుకుని వ్యాపారుల తాకిడి ఉంటుంది.

ఎంతో మార్పు వచ్చింది..



సీతంపేట వారపు సంతకు 30 ఏళ్లుగా వస్తున్నానని పాలకొండ పట్టణానికి చెందిన వ్యాపారి **పిన్నింటి ఆదిలక్ష్మి** చెప్పారు. ఒకప్పుడు రూపాయి ఉండే పైనాపిల్ నేడు రూ.10కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొండచీపురు ఒక్కొక్కటి గతంలో రూ.2 ఉండేదని...ప్రస్తుతం రూ.35 పలుకుతోందన్నారు. వీటిని ఇక్కడ కొనుగోలు చేసి...మైదాన ప్రాంతాల్లో విక్రయిస్తుంటానని తెలిపారు.

సంతలే ఆధారం..



తాము సేకరించే అటవీ ఉత్పత్తులను విక్రయించేందుకు ఏళ్ల తరబడి వారపు సంతల పెనే ఆధార పడుతున్నామని దబర గ్రామానికి చెందిన **సవర సొంబూరు** తెలిపాడు. తాము తీసుకువచ్చిన అటవీ ఫలసాయాలను మైదాన ప్రాంతాల వ్యాపారులకు విక్రయిస్తామని చెప్పాడు. ఈ డబ్బులతో ఇంటికి సరిపడా సరుకులను తీసుకుపోతామని వివరించాడు. సీతంపేట సంతకు తాము తీసుకువచ్చిన ఫలసాయాలకు మంచి ధర లభిస్తుందని పేర్కొన్నాడు.



సంత షెడ్డులో నిద్రిస్తున్న గిరిజనులు



డివైడర్‌పై నిద్రిస్తున్న వ్యాపారులు

విజ్జీకి మంచి రోజులొచ్చేనా?

- ఇండోర్ స్టేడియం నిరుపయోగం
- అసంపూర్తిగా టెన్నిస్ క్లే కోర్టు
- సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు అధ్వానం



విజ్జీ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం

విజయనగరం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):

క్రీడలకు పుట్టినిల్లులాంటి విజయనగరంలో ఎంతోమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించారు. అప్పట్లో టీడీపీ హయాంలో జిల్లా కేంద్రం శివారున ఉన్న విజ్జీ క్రీడా మైదానం అభివృద్ధికి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఎంతో కృషి చేశారు. ఇది జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలోనే ఉంది. ఈ ప్రాంగణంలో శాప్ ఆధ్వర్యంలో 72 ఎకరాలకు పైగా స్థలం ఉంది. ఈ స్థలంలో అనేక మంది క్రీడాకారులు సాధన చేస్తుంటారు. వీరితో పాటు పట్టణ వాసులు అనేక మంది ఉదయం, సాయంత్ర సమయాల్లో నడక, సైక్లింగ్ కోసం వస్తుంటారు. ఇలా ఎంతోమందికి ఉపయోగపడుతున్న విజ్జీ క్రీడా మైదానాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

రూ.కోట్లు వెచ్చించినా..

విజ్జీ మైదానంలో 2014-19 మధ్య కాలంలో నాటి కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు కృషితో రూ.20 కోట్ల విలువైన ప్రాజెక్టులను తీసుకువచ్చారు. ఈ ప్రాజెక్టు కింద స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణానికి కృషి చేశారు. టీడీపీ హయాంలో పనులు కూడా చకచకా జరిగాయి. సుమారు రూ.2 కోట్ల విలువైన పనులు చేపట్టారు. ఇందులో రూ.68 లక్షలకు పైగా బిల్లులు చెల్లించారు. ప్రభుత్వం మారడంతో వాటిని అలాగే వదిలేశారు. దీంతో అవి ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. ఎంతో మంది చిన్నారులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన క్రీడా పాఠశాల గత వైసీపీ ప్రభుత్వ తీరుతో ఏకంగా ఇక్కడి నుంచి తరలి వెళ్లిపోయిన పరిస్థితి నెలకొంది.

వీఎంఆర్‌డీఏ సహకారంతో...

అప్పట్లో అశోక్ గజపతిరాజు కృషితో విజ్జీ క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేయడానికి వీఎంఆర్‌డీఏ ముందుకు వచ్చింది. లక్షలాది రూపాయలతో మైదానంలో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, స్కేటింగ్, విద్యుత్ దీపాలు, విశ్రాంతి షెల్టర్లు ఏర్పాటు చేశారు. చిల్డ్రన్స్ పార్కును అందంగా తీర్చిదిద్దారు. వీటిలో పిల్లలకు ఆహ్లాదం, విజ్ఞానం కలిగించే విధంగా అనేక నమూనాలను ఏర్పాటు చేశారు. రూ.6 కోట్లతో ఇండోర్ ప్రాంగణాన్ని నిర్మించారు. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నుంచి సీఎస్‌ఆర్ నిధులు రూ.36 లక్షలు వెచ్చించి అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ కోర్టులు రెండు నిర్మించారు. వీటితో పాటు, క్రీడాకారుల డ్రెస్సింగ్ రూం, బోరు బావి ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రూ.6 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియం ఐదేళ్లలోనే శిథిలావస్థకు చేరుకుంది. ఆకతాయిలు కిటికీల అద్దాలు, తలుపులు పగులగొట్టారు. దీంతో పాటు అసాంఘిక శక్తులు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గంజాయి విక్రయాలు, సేవనకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దీనిని వినియోగిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు..

క్రీడాకారుల ప్రయోజనాల కోసం ఎంతో ఉన్నతాశయంతో అభివృద్ధి చేసిన విజ్జీ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడా భవనాలు, పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఇండోర్ స్టేడియం అందుబాటులోకి తీసుకవచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కృషి చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభానికి చర్యలు..



విజ్జీ క్రీడా ప్రాంగణంలో గత ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఇండోర్ క్రీడా మైదానం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నాం. దీనికి సంబంధించి అన్ని వివరాలు స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు తెలియజేశాం. క్రీడా పాఠశాల భవనాల నిర్మాణం విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం.

-వెంకటేశ్వరరావు, డీఎస్‌డీఓ, విజయనగరం



చిల్డ్రన్స్ పార్కు



అసంపూర్తిగా ఉన్న క్రీడా పాఠశాల భవనాలు

శాసనసభలో మన ఎమ్మెల్యేలు

ఆర్‌ఈసీఎస్‌ను కొనసాగించండి..

- ఎమ్మెల్యే కళావెంకటరావు



చీపురుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘాన్ని (ఆర్‌ఈసీఎస్) యథావిధిగా కొనసాగించాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం శాసనసభలో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. కుప్పం, చీపురుపల్లి సంస్థలు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. ఈపీడీసీఎల్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసి, స్థానికంగా ఉన్న అవసరాల మేరకు ఆర్‌ఈసీఎస్ విద్యుత్ సరఫరా చేస్తోందన్నారు. దీని వల్ల వ్యవసాయానికి, పరిశ్రమలకి మేలు జరుగుతోందని తెలిపారు. గత ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో సహా ఇతర కూటమి నాయకులు కూడా సంస్థ కొనసాగింపునకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్‌ఈసీఎస్‌ను కొనగించాలని సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కొత్తవలసలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



శృంగవరపుకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం బలిఘట్టాంలో ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేయండంటూ శాసనసభలో శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి అవసరమైన స్థలం ఈ గ్రామ సర్వే నెంబర్ 141లో 52.55 ఎకరాలు అందుబాటులో ఉందని తెలిపారు. 'సీఎం నారా చంద్రబాబునాయుడు సహకారంతో టీడీపీ ప్రభుత్వం 2018లో ఏపీఐఐసీ ద్వారా ఈ భూమిని పరిశ్రమల స్థాపన కోసం సేకరించింది. ఇందుకు సుమారు 89 మంది రైతులకు రూ.6.25 కోట్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం చెల్లించింది. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లూ పరిశ్రమల అంశాన్ని నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క పరిశ్రమ రాలేదు. చేపలు, మాంసం దుకాణాలను యువతకు ఇచ్చింది. ఆ ప్రభుత్వంలో ఇవే యువతకు పెద్ద ఉద్యోగ అవకాశాలు. ఇప్పుడు మళ్లీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్, యువ మంత్రి లోకేష్ ల సహకారంతో కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా చేస్తోంది. ఎస్సీ ఎస్టీ మహిళలకు 10శాతం రాయితీ ఇస్తామని పరిశ్రమల శాఖ మంత్రి చెప్పడం ఆనందంగా ఉంది. బలిఘట్టానికి చెందిన ఏపీఐఐసీ భూమి వుడా లేఅవుట్‌కు ప్రతిపాదనలకు వెళ్లింది. ఈ భూమిలో పరిశ్రమలు నిర్మించే ప్రతిపాదన ఏమైనా ఉందా? ఉంటే మా నియోజకవర్గానికి పరిశ్రమను మంజూరు చేయండి' అని ఎమ్మెల్యే కోరారు.

అన్నదాతల్లో అలజడి

- చివరి దశలో వరి పంటకు తెగుళ్లు
- మరోవైపు తుఫాన్ హెచ్చరికలు
- పంటను రక్షించుకోవడానికి పాట్లు



విజయనగరం కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వరి కోతలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఓవైపు వరి పంటపై తెగుళ్లు...తుఫాన్ హెచ్చరికలు అన్నదాతల్లో అలజడి రేపుతున్నాయి. వరి పంటపై రెల్ల రాల్చు పురుగు దాడి చేస్తోంది. వరి వెన్నులను కొరికివేయడంతో పంటకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. పంట అంతా నేల పాలవుతోంది. ఆరుగాలం కష్టం మట్టిపాలు కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానం సోనా మసూరి, 1121 వంటి రకాలకు తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు ఈనెల 25, 26 తేదీల్లో తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిస్థితిలో వర్షాలు కురిస్తే పండిన పంటపై ఆశలు వదిలేసుకోవాల్సిందే.

జిల్లాలో ఇప్పటి వరకూ వరి పంట ఆశాజనకంగా ఉందని రైతులు సంతోష పడుతున్న తరుణంలో రెల్ల రాల్చు పురుగు పంటను నాశనం చేస్తోంది. ఒకటీ రెండు చోట్ల కాదు. జిల్లా వ్యాప్తంగా వరి పంటకు నష్టం వాటిల్లజేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 2.4 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకూ 1.01 లక్షల ఎకరాల్లో వరి పంటను పూర్తి చేశారు. ఈ పరిస్థితిలో రెల్ల రాల్చు పురుగు సమస్య భయపెడుతోంది. గింజ గట్టి పడే దశలో వెన్నులను కొరికివేస్తోంది. పురుగు తీవ్రత రాత్రి సమయంలో చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది కొరికి వేయడంతో వెన్నులు నేల రాలుతున్నాయి. ఇది ఇలా ఉంటే ఈనెల 25, 26 తేదీల్లో తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందనే హెచ్చరికలతో అన్నదాతను బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటికే నేలపాలైన పంట ఇంటికి వచ్చే అవకాశాలు లేవని రైతులు కలవరపడుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.



రెల్ల రాల్చు తెగులుతో దెబ్బతిన్న పంట

మందును పిచికారీ చేయాలి..

ప్రస్తుతం వరి పంటకు రెల్లరాల్చు, గొంగలి పురుగులు ఉధృతి ఎక్కువగా ఉంది. గింజ గట్టి పడే సమయంలో వెన్నులు కొరికివేయడంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. రాత్రి పూట ఎక్కువగా దీని ప్రభావం ఉంటుంది. వీటి నియంత్రణకు క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్లు మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇమామెక్టిన్ బెంజోయేట్ పురుగు మందు 100 గ్రాముల పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈనెల 25, 26 తేదీల్లో తుఫాన్ కారణంగా ఒక మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. వరి కోతలు చేస్తే చేనును సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి. యంత్రాల ద్వారా కోత కోసుకునేవారు 25వ తేదీలోగా పూర్తి చేయాలి. కూలీల ద్వారా కోసుకునే వారు కోయకపోవడమే మంచిది.

-తారక రామారావు, జేడీ, వ్యవసాయ శాఖ

టీడీఆర్ బాండ్లపై దర్యాప్తు

- బొబ్బిలిలో ఇంటింటి తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు

బొబ్బిలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్ మెంట్ రైట్) బాండ్లపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం మూడో విడత దర్యాప్తు నిర్వహించారు. పట్టణ పరిధిలోని కోర్టు జంక్షన్ నుంచి పోలీసు స్టేషన్ రోడ్డు మీదు గా అమ్మిగారి కోనేరు గట్టు జంక్షన్ వరకు రోడ్డు విస్తరించిన సంగతి తెలిసిందే. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికా రంలో ఉన్నప్పుడు రోడ్ల విస్తరణలో భవనాలు, ఖాళీ స్థలాలు కోల్పోయిన వారికి నష్ట పరిహారానికి బదులుగా టీడీఆర్ బాండ్ల జారీ విధానాన్ని అమలు చేశారు. ఈ బాండ్లను కలిగి ఉన్న ఇళ్ల, స్థలం యజమానులు 1:4 నిష్పత్తిలో వాటిని వినియోగించుకునే వెసులుబాటును కల్పించారు. ఎన్ని గజాల్లో స్థలాన్ని కోల్పోతే దాని నాలుగు రెట్ల విలువ గల బాండ్లను అప్పట్లో జారీ చేశారు. ఈ బాండ్లను సదరు యజమానులు ఎక్కడైనా నిర్మాణాలు జరిపితే 1:4 ప్రాతిప దికన మున్సిపల్ ఫీజుల మినహాయింపును పొందవచ్చు. వారికి సొంతంగా నిర్మాణ పనులు లేని పక్షంలో రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరికైనా వాటిని అమ్ముకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించింది. ఈలోగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్థానంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వ హయాంలో తిరుపతి, విశాఖ, నెల్లూరు, అనకాపల్లి జిల్లాలలో టీడీఆర్ బాండ్ల క్రయవిక్ర యలు, వినియోగంలో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పలు చోట్ల ఈ ఆరోపణలు నిజ మని నిర్ధారణ అయ్యింది. వైసీపీ ప్రభుత్వ స్థానంలో మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు మంగళవారం మూడో విడతలో కూడా బొబ్బిలిలో రోజంతా దర్యాప్తు నిర్వ హించారు. పట్ట ణంలో రోడ్ల విస్తరణ కోసం కూలగొట్టిన భవనాలను, అక్కడి రోడ్లకు కొలతలు తీసి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమా వేశమై రికార్డులన్నిటినీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ జి.ప్రేమ్‌కుమార్, విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి రేవతి, రెవిన్యూ అధికారి నాగరాజు, ఇన్‌స్పెక్టరు సురేష్‌బాబు, సచివాలయాల సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



బొబ్బిలిలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

208 ఇళ్లను పరిశీలించాం..

విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ ఆదేశాల మేరకు బొబ్బిలిలో టీడీఆర్ బాండ్లు జారీ చేసిన ప్రాంతాల్లో ఇంటింటి తనిఖీలు నిర్వహించాం. నాలుగు బృందాలుగా ఏర్పడి వేర్వేరుగా తనిఖీలు చేశాం. మొత్తం టీడీఆర్ బాండ్లు జారీ అయిన 208 ఇళ్లను పరిశీలించాం. అన్ని అంశాలను పరిశీలించి పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అక్రమాలు జరిగాయా.. లేదా.. అన్నది అప్పుడే నిర్ధారించలేం. ఉన్నతాధికారులు వెల్లడిస్తారు.

-సతీష్‌కుమార్, విజిలెన్స్ సీఐ

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: జేసీ మాధవన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రారంభించామని, మిగిలిన మండలాల్లో వెంటనే ప్రారంభించాలని చెప్పారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు నూర్పులు చేసిన చోట వారికి కూపన్లు జారీ చేయాలని తెలిపారు. ధాన్యం సేకరణలో పని చేస్తున్నవారికి ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని చెప్పారు. గోనె సంచులు సిద్ధం చేయాలన్నారు. వాహనాలుకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న, మినుములు, పెసలు పంటలకు ఇన్సూరెన్స్ చేయనున్నామని ఆయన చెప్పారు.


మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

న్యూస్ బాక్స్

25న ప్రభుత్వ ఐటీఐలో అప్రంటీస్ మేళా

రాజాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 25న అప్రంటిస్ మేళా ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో అప్రంటీస్ మేళా ద్వారా ఖాళీలు భర్తీచేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, వెల్డర్ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు అప్రంటీష్ మేళాకు హాజరుకావచ్చునని తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకుని హాజరుకావాలన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

రాజాం నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని నియోజకవర్గ టీడీపీ నాయకుడు కోండ్రు జగదీష్ అన్నారు. శుక్రవారం మండలం రాజీయ్యపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించడమే కాకుండా ధాన్యం డబ్బులు వారం రోజుల్లో పడేలా చర్యలు తీసుకుంటుందన్నారు. మండలంలో 9 క్లష్టర్లలో ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఎక్కడకు తీసుకువెళ్లినా ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తారన్నారు. తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులున్నారు.

రేపు 'వేకువ' పుస్తకావిష్కరణ

రాజాం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ మజ్జి భారతి రచించిన 'వేకువ' అనే కథా సంపుటిని స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈనెల 24న ఆవిష్కరణ జరుగుతుందని రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకాన్ని మజ్జి చంద్రనాయుడు ఆవిష్కరిస్తారని, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కథారచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడి గౌరినాయుడు పాల్గొంటారన్నారు. కవులు, రచయితలు, భాషాభిమానులు, సాహిత్య అభిమానులు హాజరుకావాలని రంగనాథం కోరారు.

108 సర్వీసులని ప్రభుత్వమే నిర్వహించాలి

రాజాం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 108 సర్వీసుల ఉద్యోగులు శుక్రవారం ఇక్కడి సామాజిక ఆసుపత్రి ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. 108 సర్వీసుల్ని ప్రభుత్వమే నిర్వహించాలని, పని చేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 49 ద్వారా సిబ్బందికి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, మూడు షిఫ్టుల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు.

వార్షిక బడ్జెట్ సన్నాహక సమావేశం

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 2024-2025 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. కమిషనర్ నల్లనయ్య దీనిపై సమీక్షించారు. ఈ బడ్జెట్ తయారీకి సంబంధించిన వివరాలను విభాగాధిపతులు సిబ్బంది ముందు ఉంచారు. అందరి సూచనలు, సలహాలతో నగరాభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన ఉండాలన్నదే తమ అభిమతమని కమిషనర్ నల్లనయ్య అన్నారు. సమావేశంలో సహాయక కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఆడిట్ అధికారులు లూథర్‌పాల్, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు హరిబాబు, రమణమూర్తి, ఎంఈటీ రాయల్‌బాబు, ప్రజారోగ్యఅధికారి కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

24న సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్, నవంబరు(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో వచ్చే నెల 5 నుండి 8 వరకు నిర్వహించనున్న 71వ అంతర్ జిల్లాల మహిళలు, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 24న నిర్వహించనున్నామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, అధ్యక్ష, కార్యదర్శులు ఐవీపీ రాజు, రంగారావు దొర, కె.విప్రభావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఎంపిక పోటీలకు హాజరయ్యే పురుషులు 85 కేజీలలోపు, మహిళలు 75 కేజీలు లోపు ఉండాలని అన్నారు. వివరాలకు 99497 21949 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కొత్తవలస, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనాలను ఇవ్వాలని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కార్మికుల కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపి వేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించుకోవాలి, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జామి వెంకట అప్పారావు, సూరెడ్డి శ్రీను, జక్కాన రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

భోగాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మంచి పేరుతెచ్చుకునే విధంగా విధులు నిర్వహించాలని ఎస్‌ఐలు వి.పాపారావు, పి.సూర్యకుమారి సూచించారు. మండలం కంచేరు సమీపంలో బదిలీ అయిన సిబ్బందికి శుక్రవారం ఘనంగా సన్మానించి సత్కరించారు.

వలంటీర్లపై మంత్రుల వ్యాఖ్యలు తగవు



ర్యాలీ చేస్తున్న వలంవటీర్లు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 22: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను తొలగించం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను విస్మరించి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి వలంటీర్ల వ్యవస్థే లేదంటూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల యూనియన్ ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి గంటస్తంభం వరకూ ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థే లేదని పచ్చి అబద్ధాలు చెబుతున్న మంత్రులు రాజీనామా చేసిన వలంటీర్ల కోసం ఎందుకు న్యాయ స్థానాన్ని ఆశ్రయించారని ప్రశ్నించారు. వలంటీర్లు మనోభావాలతో ఆడుకోవడం సమంజసం కాదని, తక్షణమే వారికి న్యాయం చేయాలని, లేని పక్షంలో దశలవారీ పోరాటానికి సిద్ధమౌతున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో నేడు మెగా రక్తదాన శిబిరం


అశోక్ గజపతిరాజుతో చర్చిస్తున్న తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం రూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): విజయనగరం నియోజకవర్గ శాసన సభ్యురాలు అదితి గజపతిరాజు పుట్టిన రోజు ఈ నెల 24 సందర్భంగా ముందుగా శనివారం ఉదయం 8 గంటలకు పార్టీ కార్యాలయం(అశోక్ బంగ్లా)లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు టీడీపీ నగర, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు, విద్యార్థిని, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయా లని కోరారు.

● రక్తదాన శిబిర నిర్వాహణకు సంబంధించి తెలుగుయువత, టీఎన్ ఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజుతో చర్చించారు. ఈ మేరకు తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, టీడీపీ నగర, మండల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉచిత న్యాయ సహాయం అందించడమే లక్ష్యం

విజయనగరం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయసేవాధికారి సంస్థ లక్ష్యమని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్ కుమార్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి ఆదేశాలతో శుక్రవారం విజయనగరం సబ్‌జైలుని సందర్శించారు. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తని ఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జైల్లో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయ సాయం అందించడానికి జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. వాటిని సక్రమంగా కొనసాగించాలన్నారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలు న్యాయవాది లేకుండా ఉండకూడదని, అట్టి వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయసహాయ న్యాయవాదిని అందిస్తుందన్నారు. అనంతరం వంటగదిని, భోజనశాలను, స్టోర్ రూంను సందర్శించారు.


సబ్‌జైలులో ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి రాజేష్‌కుమార్

రామతీర్థంలో ప్రత్యేక పూజలు


సీతారాములకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అర్చకులు శ్రీరామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చనలు నిర్వహించారు. భక్తులు హాజరై తిలకించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించగా అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, రామ్‌గోపాల్ నిర్వహించారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు


అయ్యన్నను కలిసిన ఎస్.కోట, విజయనగరం ఎమ్మెల్యేలు లలితకుమారి, అతిథి

శృంగవరపుకోట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని శుక్రవారం శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విజయనగరం ఎమెల్యే అదితీ గజపతిరాజుతో కలసి మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనసభను సమర్థవంతగా నడిపారని ప్రశంసించారు. సభలో మాట్లాడేందుకు సమయం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డైట్‌లో 27న జిల్లా స్థాయి నృత్య పోటీలు

నెల్లిమర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్‌లో ఈ నెల 27న ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పలు అంశాల్లో జిల్లా స్థాయి బాలరంగ్ సాంప్రదాయ నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్టు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తప్పెటగుళ్లు, కర్రసాము, చెంచులవేట, ధింసా, జాలరి, బంజారా అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీల్లో 8,9,10 తరగతుల విద్యార్థులతో పాటు జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. వివరాలకు పి.రవికుమార్ (7989350244), కె.సూర్యారావు(8919985388)లను సంప్రదించాలని ఆమె సూచించారు.

వేతన బకాయిల విడుదలలో లోక్‌సత్తా కృషి కీలకం

విజయనగరం దాసన్నపేట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న 800 ఔట్ సోర్సింగ్ జీడీఏలకు గత ప్రభుత్వం బకాయిపడ్డ వేతనాల విడుదలలో లోక్‌సత్తా పార్టీ కీలక పాత్ర పోషించిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన ఏడాది నుంచి రాష్ట్రంలో జీడీఏలను, జీతాలను అందుకోకుండా వెట్టిచాకిరి చేస్తున్న తీరును, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి పలుమార్లు రాష్ట్ర అప్కాస్ ఎండీ దృష్టికి తీసుకువె ళ్లామన్నారు. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి, అన్ని జిల్లా కలెక్టర్లు, వైద్యాశాఖా ధికారులకు బకాయిలను చెల్లించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో రామచంద్రరాజు, రామ్మోహన్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కోండ్రు


సీఎంను కలిసిన కోండ్రు మురళీమోహన్

రాజాం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతి కార్యాలయంలో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి అంశాల పై సీఎంతో చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రధాన సమస్యలపై మాట్లాడారు. పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంలో సీఎం సానుకూలంగా స్పందించినట్టు కోండ్రు తెలిపారు.

నేటి నుంచి దేశవాళీ టీ- 20 టోర్నీ

పోటీపడనున్న 7 రాష్ట్ర జట్లు

విజయనగరం టౌన్, నవంబరు(ఆంధ్రజ్యోతి): జిల్లా వేదికగా మరో ప్రతిష్ఠాత్మకమైన దేశవాళీ టీ-20 క్రికెట్ సమరం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో పాల్గొనే క్రీడాకారుల వేలానికి ఒక రోజు ముందుగా ప్రారంభం కానున్న సయ్యద్ ముస్తక్ అలీట్రోఫీపై దేశవ్యాప్తంగా అందరి కళ్లు ఈ టోర్నీపై ఉంటుందనడంలో సందేహం లేదు. బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ టోర్నీలో అస్సాం, రైల్వేస్, ఒడిస్సా, విదర్భ, పాండిచ్చేరి, చండీగర్, చత్తీస్‌ఘర్ జట్లు తలపడనున్నాయి. డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో అస్సాం- రైల్వేస్ జట్లు తలపడనున్నాయి. విజయనగరంలో డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానం, సర్ విజ్జీ మైదానంతో పాటు, విశాఖలోని వైఎస్సార్ క్రికెట్ మైదానంలో వచ్చే నెల 5 వరకు నిర్వహించే టోర్నీకి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఖండ్యాంలో ఆర్టీసీ రూట్ సర్వే

రేగిడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖండ్యాం గ్రామానికి ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు పాలకొండ ఆర్టీసి డీఎం పి వెంకటేశ్వరరావు సిబ్బంది బృందం ఖండ్యాం రూట్‌లో శుక్రవారం సర్వే నిర్వహించి రోడ్డును పరిశీలించారు. గతంలో ఈరూట్‌లో బస్సు సౌకర్యం ఉండగా, రోడ్డు బాగోలేకపోవటంతో బస్సు సర్వీస్ నిలిచిపోయింది. తాజాగా గ్రామపెద్దలు ఆర్టీసీని సంప్రదించి ఇబ్బందులు తెలియజేశారు. దీంతో పాలకొండ ఆర్టీసీ డిపో సిబ్బంది స్పందించారు. మజ్జిరామునిపేట, లక్ష్మీపురం మీదుగా కొమిర, వెంకటాపురం, ఖండ్యాంకు ఆర్టీసీరూట్‌ను డీఎం ఇతరసిబ్బంది పరిశీలించారు. వచ్చేనెల 10 నుంచి ఖండ్యాం రూట్‌కు బస్సు అందుబాటులోకి తెస్తామని డీఎం హామీ ఇచ్చినట్టు గ్రామస్థులు తెలిపారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

దత్తిరాజేరు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని షికారుగంజి ఆదర్శ పాఠశాల విద్యార్థులు టి.జాహ్నవి(ఇంటర్ మొదటి సంవత్సరం), ఎస్.గిరిచరణ్(9వ తరగతి) రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే.దేవకీవందన తెలిపారు. క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ రాజేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా పీఈటీ మాట్లాడుతూ ఈ నెల 11న విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖపట్టణం జిల్లా పరవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

పూసపాటిరేగ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): పనులకు ఆటంకం లేకుండా చూడాలని మండల తెలుగుదేశంపార్టీ నాయకులు స్థానిక తహసీల్దార్ గోవింద్‌ను కోరారు. గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని, ఇప్పుడైనా రికార్డులను సరిచేయాలని శుక్రవారం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి కోరారు. నిబంధనలను అనుసరించి పనులన్నీ జరుగుతాయని, దీనిపై ఎటువంటి అపోహలు వద్దని తహసీల్దార్ తెలిపారు. సమస్యలను తనదృష్టికి తీసుకొని వస్తే తప్పకుండా పరిష్కారం దిశగా చర్యలు తీసుకొంటానన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు మహంతి శంకరరావు, మాజీ జెడ్పీటీసీ ఆకిరి ప్రసాదరావు, మండల నాయకులు పతివాడ తమ్మినాయుడు, గోపి, పిన్నింటి శ్రీనివాసరావు, కొత్తకోట రమణ, పలువురున్నారు.

దుకాణాల పరిశీలన

నెల్లిమర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొయిద జంక్షన్ ప్రాంత వార్డు సచివాలయ పరిధిలోని భవనాలను, దుకాణాలను నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు శుక్రవారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో మార్పులు చేసి ఉన్న భవనాలకు సంబంధించి ఆస్తి పన్ను విధిస్తున్నారా? లేదా? ట్రేడ్ లైసెన్సులు వసూలు చేస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ డి.ఉమాభాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు

చీపురుపల్లి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగపురం సమీపంలో ఉన్న శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. దీంతో అమ్మవారి కుంకుమ పూజల్లో పాల్గొనేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం కూడా కొనసాగింది. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసే భక్తులు, కుంకుమ పూజ ల్లో పాల్గొనే భక్తులతో ఆలయ మండపం కిటకిటలాడింది.


కుంకుమ పూజల కోసం సిద్ధమైన భక్తులు

చీటీల నిర్వాహకుడు అదృశ్యం

భోగాపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలం భోగాపురం గ్రామానికి చెందిన చీటీల నిర్వాహకుడు తిరుమరెడ్డి మురళి కుటుంబం తప్పిపోయిందంటూ అతని బంధువులు లంకలపల్లి కనకరత్నం శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి మురళీ భోగాపురం గ్రామంతో పాటు ఇతర గ్రామాల ప్రజల నుంచి చీటీల రూపంలో సుమారు రూ.38కోట్ల వరకు సేకరించాడు. అయితే ఇటీవల చీటీలు చెల్లించలేనంటూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం తేరుకుని గ్రామానికి రాగా చీటీలు కట్టే వారు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా అందరికీ ఉన్నంతలో ఇస్తానంటూ చెప్పుకొచ్చాడు. అనంతరం భార్యా పిల్లలతో కలిసి ఈనెల 20న ఇంటినుంచి వెళ్లిపోయారు. దీనిపై మురళీ కు టుంబం కనిపించడం లేదంటూ సమీప బంధువులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

కొత్త చెరుకుపల్లిలో..

చీటీల రూపంలో నగదు చెల్లించి మోసపోయామంటూ భోగాపురం మండలం కొత్తచెరుకుపల్లికి చెందిన మజ్జి త్రినాథమ్మ, కొయ్య మంగమ్మ, చిల్లాపార్వతీ, బాకి మహేష్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలి మండలం వలందపేటకు చెందిన సరగడ పార్వతీ చీటీలు, లక్కీ డ్రా నిర్వహించేది. గ్రామంలో అందరి దగ్గర చీటీలు, లక్కీ డ్రా పేరిట సుమారు రూ.కోటీ 42లక్షలు వసూలు చేసింది. అనంతరం నగదు ఇవ్వమంటే తిరిగి ఇవ్వలేదని, దీనిపై న్యాయం చేయాలంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. సరగడ పార్వతిని చీటీ డబ్బులు అడిగినందుకు సరగడ పార్వతి, లక్ష్మణరెడ్డి, సురేష్, మహేష్, కృష్ణ దాడిగి దిగి కొట్టారని మజ్జి త్రినాథమ్మ పిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కోరుకొండ పాలేనికి చెందిన అబద్ధం అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా, అరెస్టు చేసి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు. అధిక మొత్తంలో విక్రయించేందుకు మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

గుజ్జింగివలసలో అగ్నిప్రమాదం

గుర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుజ్జింగివలస గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పెంకుటిల్లు అగ్నికి ఆహుతైంది. డి.వెంకటేశ్వరరావుకు చెందిన ఇంటిలో విద్యుత్ షార్ట్‌షర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంట్లో ఉన్న రూ.4 లక్షల నగదు, కలర్ టీవీ, ఫ్రిడ్జ్, విలువైన వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. వ్యవసాయ పనుల నిమిత్తం అందరూ బయటకు వెళ్లడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థుల సహకారంతో మంటలను అదుపు చేశారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఆస్తినష్టం అంచనా వేస్తున్నారు.

గడ్డికుప్పలు దగ్ధం

భోగాపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలం లింగాలవలస గ్రామం సమీపంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ముకుంద వెంకటరమణ, ముకుంద రమణమూర్తి, బాడితబోయిన బంగారయ్యకు చెందిన సుమారు రూ.1.50లక్షల విలువైన మూడు గడ్డికుప్పలు, ఒక పాక అగ్నికి ఆహుతయ్యాయి. వెంటనే స్థానికులు మంటలు అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న చిట్టివలసకు చెందిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి తదపరి చర్యలు చేపట్టారు.

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

గంట్యాడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దళిత మహిళను ప్రేమించి, మోసం చేసి, వివాహం చేసుకోవడానికి నిరాకరించిన వ్యక్తిని అరెస్టు చేసిన డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండ లంలోని కిర్తుబర్తి గ్రామానికి చెందిన శినగం వెంకట సత్యం అనే వ్యక్తి బాపట్ల జిల్లా స్టువర్టుపురం వద్ద రైల్వే స్టేషన్‌లో పాయింట్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. ఆయన గతంలో ఒక ప్రైవేటు డిగ్రీ కాలేజీలో పనిచేసే సమయంలో స్థానిక ఓ గ్రామానికి చెందిన దళిత యువతితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రేమించు కుని, శారీరకంగా ఒక్కటయ్యారు. ఆ తర్వాత యువతి వివాహం చేసుకోవాలని అడగడంతో కులం పేరుతో దూషించి, వివాహానికి నిరాకరించారు. దీనిపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

న్యాయవాదిపై దాడి దారుణం

కొత్తవలస, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో కోర్టు ఆవరణలోనే ఒక న్యాయవాదిని విచక్షణా రహితంగా నరికిహత్య చేసినందుకు నిరసనగా శుక్రవారం కొత్తవలస న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహి ష్కరించారు. గురువారం తమిళనాడులో కోర్టు నుంచి బైటకు వస్తున్న కన్నన్ అనే న్యాయవాదిని కత్తితో తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటనపై రాష్ట్రంలోని పలు న్యాయవాద సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కొత్తవలస కోర్టులో విధులు నిర్వహిస్తున్నట్టు న్యాయమూర్తికి ముందుగా వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలి పారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

ప్లాన్ వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బహుళ అంతస్థుల నిర్మా ణ సమయంలో అనుమతి పొందిన భవనాలకు సంబంధించిన ప్లాన్ వివరాలు తెలి పే విధంగా ప్రకటన బోర్డులను సంబంధిత భవన యాజమానులు లేదా బిల్డర్లు ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి అన్నారు. భవన నిర్మాణం జరుగుతున్న సమయంలో ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతి ఒక్కరూ గ్రీన్ నెట్‌లను తప్ప నిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి, డెబ్రిస్‌ను వేయరా దన్నారు. ఎవరైనా ఈ నిబంధనలు విస్మరిస్తే, అపరాధ రుసుం వసూలు చేస్తామని ప్రకటనలో తెలిపారు.

కేజీవీబీల్లో పోస్టులకు 52 మంది ఎంపిక

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీ పోస్టులకు 52 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరికి కమిటీ సభ్యులైన డీఈవో మాణిక్యంనాయుడు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రామానందం, జీసీడీవో మాలతి, సమగ్ర శిక్ష పర్యవేక్షకులు సూర్యనారాయణ మూర్తి సమక్షంలో ఎంపికైన వారిలో కొంతమందికి నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 52 మంది అభ్యర్థులు ఎంపిక కాగ, వారిలో ఆరుగురు అన్‌విల్లింగ్ చూపించారు. 46 మందికి పోస్టింగ్ నియామక పత్రాలు అందజేయనున్నారు.

రేపు శిష్టకరణాల వనభోజన మహోత్సవం

విజయనగరం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని సారిపల్లి రహదారిలో ఈ నెల 24న శిష్టకరణాల కార్తీక వనభోజన మహోత్సవం జరుగుతుందని మహోత్సవ కమిటీ ప్రతినిధులు సంజీవరావు, బలివాడ వెంకట రమణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని శిష్టకరణ కుటుంబ సభ్యులంతా ఈ కార్యక్రమానికి హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

మరణించినా.. జీవించు!

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు అంతా ముందుకొస్తే ప్రజల్లో కూడా అవగాహన పెరిగే అవకాశముంది. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ అవయవదానంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తూ ఒప్పంద పత్రాలను సేకరించింది. కానీ, ఆ స్థాయిలో జిల్లాలో అవయవదానాలు జరగడం లేదు.

మార్గదర్శకాలు..

అవయవ దానం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త మార్గదర్శకాలు రూపొందించాయి. అవయవ దాతల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. అంత్యక్రియలకు కలెక్టర్ లేదా ప్రభుత్వ తరఫున ఒక ప్రతినిధి తప్పకుండా హాజరుకావాలని ఆదేశించింది. అంత్యక్రియల ఖర్చుకు రూ.10 వేలు కూడా అందిస్తోంది. అవయవాలు తరలింపునకు వీలుగా గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని మార్గాలను సైతం ఎంపిక చేసింది. అయితే, ఇంత చేస్తున్నా అవయవ దాతల సంఖ్య మాత్రం పెరగకపోవడం విచారకరం.

అవగాహన పెరగాలి

ఫారిన్ దేశాల్లో 18 ఏళ్లు దాటిన వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడు ఓ నిబంధన పెడతారు. భవిష్యత్‌లో ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయితే.. అవయదానం చేయాలనే నిబంధన లైసెన్స్‌లో పొందుపరుస్తారు. మన దేశంలో కూడా అలాంటి నిబంధనలు పెడితే మంచిది. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను కుటుంబసభ్యులే ముందుకొచ్చి అందించాల్సిన అవసరం ఉంది. అవయవదానంతో వారిని మరొకరిలో సజీవంగా చూసుకోగలమన్న విషయాన్ని గ్రహించాలి.

- డాక్టర్ తిరుమల ప్రసాద్, తిరుమల మెడికవర్ వైద్యుడు, విజయనగరం.

ఒప్పంద పత్రాలు ఇవ్వాలి

సమాజంలో అవయవాలు సమకూర్చక లక్షల మంది ఇబ్బంది పడుతున్నారు. కానీ, వేలల్లో కూడా అవయవ దాతలు లేకపోవడం దారుణం. చాలామంది బ్రెయిన్ డెడ్ రోగుల అవయవాలను ఇచ్చేందుకు కుటుంబసభ్యులు ముందుకు రావడం లేదు. ఈ తీరు మారాలి. ప్రతిఒక్కరూ తాము చనిపోయిన తరువాత తమ అవయవాలను దానం చేస్తామని ఒప్పంద పత్రం ఇవ్వాలి.

- కేఆర్‌డీ ప్రసాదరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ విజయనగరం

పరాయి పంచనే..

- మద్యం దుకాణం వెనుక వెల్‌నెస్ కేంద్రం నిర్వహణ
- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

భోగాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భోగాపురం వెల్‌నెస్ కేంద్రానికి మోక్షం కలిగేదెన్నడో అని స్థానికులు ఎదురు చూస్తున్నారు. ఒకప్పుడు భోగాపురం గ్రామంలో వెల్‌నెస్ కేంద్రం పంచాయతీ కార్యాలయ సమీపంలో గల ఓ అద్దె కొంపలో ఉండేది. సంబంధిత యజమాని ఆ ఇంటిని ఇటీవల మద్యం దుకాణానికి అద్దెకు ఇచ్చాడు. దీంతో చేసేది లేక ఆ మద్యం దుకాణానికి వెనుక వైపునే ఓ మూలన వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్వహించాల్సి వస్తోంది. దీంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే భోగాపురం గ్రామంలోని బొల్లి వీధి సమీపంలో పాత సీహెచ్‌సీ స్థానంలో నూతనంగా లక్షలు వెచ్చించి వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. బిల్లు కాకపోవడం తో గుత్తేదారులు ఈ భవనాన్ని అప్పగించనట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని భోగాపురం వాసులు కోరుతున్నారు.



పూర్తయిన వెల్‌నెస్ కేంద్రం


ప్రస్తుతం వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నది ఇందులోనే..

అవయవదాతా.. వర్ధిల్లు!

(5వ పేజీ తరువాయి)

చెప్పారు. దీంతో కుమార్తె అవయవ దానానికి వారు అంగీకరించారు. శుక్రవారం గ్రీన్‌చానల్ ద్వారా పల్లవి కిడ్నీలు, కళ్లను అంబులెన్స్‌ల్లో విశాఖలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. గ్రీన్‌చానల్ కోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్‌సీసీ, విద్యార్థులు పల్లవి మృతదేహానికి నివాళులు అర్పించారు. అవయవ దానం కార్యక్రమం లో జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరక్టర్ డాక్టర్ కె.రాంబాబు, తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, ఆర్డీవో దాట్ల కీర్తి, ఇతర అధికారులు బంధువులు పాల్గొన్నారు. తల్లి తండ్రులను పరామర్శించి అభినందించారు.

కన్నీటి వీడ్కోలు

విజయనగరం ఆసుపత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం అంబులెన్స్‌లో పల్లవి మృతదేహాన్ని మురపాక గ్రామానికి తీసుకువచ్చారు. అలాగే, తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిదండ్రులను కూడా రెండు అంబులెన్స్‌ల్లో గ్రామానికి తెచ్చారు. పల్లవి మృతదేహాన్ని చూసి గ్రామస్థులు, ఆమె చదువుతున్న పాఠశాల విద్యార్థులు, స్నేహితులు, ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రహదారి కి ఇరువైపులా నిలబడి పల్లవి అమర్ రహే అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తల్లిదండ్రులు అంబులెన్స్‌ల్లో ఉండి తమ కుమార్తెను కడసారి చూసుకుని రోదించారు. చిట్టితల్లికి కన్నీటివీడ్కోలు పలికారు.


కుమార్తెను కడసారి చూసుకుంటూ విలపిస్తున్న తల్లి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మా అమ్మ అనుకున్నాను

మా అమ్మ మరణించిన కొన్ని రోజులకు పల్లవి పుట్టింది. మళ్లీ మా అమ్మే పుట్టిందనుకున్నాను. రాత్రి చదువుకున్న తరువాత నా దగ్గరే నిద్రపోయేది. పనిమీద బయటకు వెళ్తే పలుమార్లు ఫోన్ చేసి ఎప్పుడొస్తావు నాన్న అని అడిగేది. ఇప్పుడు నన్ను అడిగేవారు లేరు. పల్లవి అవయవాలను దానం చేస్తే మరికొంతమందికి ప్రాణం పోసిన వారమవుతా మని డాక్టర్లు, నా స్నేహితులు చెప్పారు. దీంతో నేను, నా భార్య ఒప్పుకున్నాం. నా కూతురు చనిపోయి, మరికొంతమం ది జీవితాలను నిలబెట్టడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయవదానానికి ముందుకు రావాలి.

- వెంకటరమణ, పల్లవి తండ్రి

న్యూస్ బాక్స్

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

బొబ్బిలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం డిసెంబరు 2 తేదీ నుంచి 28 తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజల నుంచి స్థానిక సచివాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి బి.మధుసూదనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు జనవరి 1 నుంచి మార్చి 31 వరకు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు సంక్రాతి కానుకగా మంజూరు చేస్తామని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల బూత్ లెవెల్ అధికారులు శనివారం, ఆదివారం అభ్యంతరాల స్వీకరణ నిమిత్తం వారి వారి పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుంటామని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, ఎన్నికల ఉప తహసీల్దార్లు, ఈఆర్‌వోలు నియమించిన సూపర్‌వైజర్లు ఆ రెండు రోజులు అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

బొబ్బిలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొయ్యకొండవలస గ్రామ పరిధిలో సుమారు 400 లీటర్ల బెల్లపు ఊటను శుక్రవారం ధ్వంసం చేసినట్టు బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడి చేశామని ఆయన చెప్పారు.

ఓటర్ల జాబితా సిద్ధం

బొబ్బిలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు నీటి సంఘం ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేశామని హెచ్‌డీటీవో టీకేవీఎస్ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మేజర్, మైనర్ పరిధిలోని 13 సంఘాలకు, మీడియం పరిధిలో 5 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

తూర్పుకాపు యువజన నాయకుడిగా రామకృష్ణ

తెర్లాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల పరిధిలోని బూరిపేట విజయరాంపురం గ్రామానికి చెందిన బూరి రామకృష్ణను నియమించారు. ఈమేరకు ఆ సంఘ రాష్ట్ర చైర్మన్ గిరడ అప్పలస్వామి శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సంఘ జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో రామకృష్ణను నియమించినట్టు ఆయన వెల్లడించారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే బేబీనాయన


లోకేశ్‌ను కలిసిన బేబీనాయన, పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్

బొబ్బిలి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌లను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహనాయుడుతో కలిసి శుక్రవారం అమరావతి సచివాలయంలో వేర్వేరుగా కలుసుకున్నారు. వందేభారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ కల్పించాలని రామ్మోహన్‌ని తొలుత కోరారు. విద్యా మంత్రి లోకేశ్ దృష్టికి పలు విద్యా సంబంధిత అంశాలను తీసుకెళ్లారు.

● పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌ను కలిసి, స్థానిక ఏపీఐఐసీ గ్రోత్ సెంటరులో పారిశ్రామికాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. బొబ్బిలి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని, కార్మికులకు న్యాయం చేయాలని, ఎంటర్‌ప్రెన్యూర్స్ డిమాండ్లన్నిటినీ పరిశీలించి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్టు బేబీనాయన తెలిపారు.

బొబ్బిలిలో బ్యాంకర్ల కమిటీ సమావేశం

బొబ్బిలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాబార్డ్ జీఎం ఎ.నాగార్జున పాల్గొని, మాట్లాడారు. రైతులకు పంట రుణమాఫీ, ఇతర లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రయోజనాలు సకాలంలో అందించే బ్యాంకర్లు ప్రయత్నించాలన్నారు. అలాగే స్వయంశక్తి పొదుపు సంఘాల వారు దాచుకున్న డబ్బులను సభ్యుల అవసరాల మేరకు అప్పు ఇచ్చే విధంగా ఇంటర్నల్ లాండింగ్‌ను అందరు బ్యాంకు మేనేజర్లు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలి


చదును చేసిన భూముల వద్ద గిరిజన సంఘ నాయకులు

బొబ్బిలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిమ్మలపాడు రెవెన్యూ పరిధిలో గల డీకేటీ పట్టా భూములను ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనవాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి గెమ్మెల జానకిరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనుల సాగులో ఉన్న ప్రభుత్వ భూములను సాలూరు మండలం బాగువలస గ్రామానికి చెందిన ఇద్దరు వ్యాపారస్తులు దౌర్జన్యంగా యంత్రాలతో చదును చేసి, స్వాధీనం చేసుకోవాలనుకోవడం సరికాదన్నారు. వీరిపై అట్రాసిటీ, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి: ఎస్పీ

మెంటాడ (ఆంధ్రజ్యోతి) నవంబరు 22: గంజాయి నిర్మూలనకు కృషి చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఆంధ్ర పోలీసు స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ గంజాయి నివారణలో భాగంగా ఐదు చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోలీసు విధులు కాకుండా మిగతా శాఖల పనులు తమకు అప్పగిస్తున్నారని కొందరు మహిళా పోలీసులు ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం ఆయన పేదలకు దుస్తులు, యువతకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. సీఐ రమణ, ఎస్ఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో సమస్యలున్నాయి

బాడంగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో పలు సమస్యలు ఉన్నాయని టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గొల్లాది పంచాయతీ కామన్నవలస గ్రామ రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం నిర్వహించిన ల్యాండ్ రీ సర్వే కారణంగా సర్వే నెంబర్లు తారుమారయ్యాయని, దీంతో ల్యాండ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయిందని తెలిపారు. కామన్నవలస రెవెన్యూ పరిధిలో పెట్రోల్ బంకు నిమిత్తం దాసరి యమున సుమారు 30 సెంట్ల స్థలం కొనుగోలు చేసి, నిర్మాణ పనులు పూర్తి చేశారని, కానీ ఒన్‌బీ రానందున బంకు నిలిచిపోయిందన్నారు.

పేదల జీవనోపాధే లక్ష్యం

- ఉపాధి హామీ కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆసిస్ గుప్తా

రామభద్రపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ పథకం కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆసిస్ గుప్తా తెలిపారు. మండలంలోని కొట్టక్కి, తారాపురం, కాకర్లవలస గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో ఉపాధి హామీ ద్వారా సుమారు రూ.3 వేల కోట్లతో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు భూగర్భ జలాల అభివృద్ధికి పెద్ద ఎత్తున చెక్‌డ్యాం పనులు కూడా మంజూరు చేశామని తెలిపారు. చెరువుల్లో చెక్‌డ్యాంలు, ఫీడర్ ఛానళ్లు చేపడతామని చెప్పారు. అలాగే తోటల్లో ట్రెంచెస్, పండ్ల తోటల్లో ఫారంపాండ్స్ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది నేలబావుల తవ్వకానికి కూడా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 23 వేల గోకుల షెడ్లు నిర్మాణం చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఈ ఏడాది 26 వెల ఎకరాల్లో ఉద్యాన పంటలు పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం స్టేట్ డైరక్టర్ షణ్ముఖ్‌కుమార్, ప్రోగ్రాం అధికారి కిరణ్ పాడి, జిల్లా డుమా పీడీ కళ్యాణచక్రవర్తి, ఏపీడీలు కిరణ్, శ్రీనివాసరావు, ఎంపీడీవో రత్నం, ఏపీవోలు గొలగాని త్రినాథరావు, విజయలక్ష్మిలు పాల్గొన్నారు. ● గజపతినగరం: గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనుల్లో నాణ్యత ఉండాలని ఉపాధి హామీ పథకం కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆశిస్ గుప్తా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. ఇంకుడుగుంతలను పరిశీలించి వాటి నిర్మాణాలకు అయిన ఖర్చు, వాటి విని యోగం, చెల్లింపులపై అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి రికార్డులను పరిశీలించారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఆసిస్ గుప్తా

మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి చేయాలి

బలిజిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండంలోని మంజూరైన మినీ గోకులాలను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా నీటియాజమ్యా సంస్థ పథక సంచాలకులు కె.రామచం ద్రరావు ఆదేశించారు. మండలంలోని సుభద్ర, బర్లి, పెద్దపెంకి గ్రామాల్లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కేశవరావు, ఈసీ శ్రీనివాసరావు ఉన్నారు. ● కురుపాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లను లబ్ధిదారులు సక్రమంగా నిర్మించాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి కోరారు. శుక్రవారం కురుపాంలో నిర్మిస్తున్న గోకులం షెడ్లు ఆమె పరిశీలించారు. మండలంలో 26 గోకులం షెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కొండాపురంలో గ్రామదర్శిని

పాలకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండాపురం గ్రామంలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.మన్మథరావు, ఎంపీడీవో ఎంవీ రంగారావు పాల్గొని, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో మాట్లాడి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

పాలకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 24న పాలకొండలో జరిగే బైకు ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రీమియం చెల్లింపు గడువు పెంచాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి రైతులు ఆపత్కాలంలో బీమా పొందేందుకు ఉద్దేశించిన ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించాలని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2024-25 రబీకి సంబంధించిన ప్రీమియం చెల్లించడానికి ఈనెల 22 వరకు గడువు ఇచ్చినా, ఇక్కడి గిరిజన రైతులకు అవగాహన లేకపోవడంతో ప్రీమియం చెల్లింపునకు అవకాశాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాన్‌షాప్‌లో చోరీ

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట పంచాయతీ భద్రగిరి జంక్షన్‌లో ఉన్న రమేష్ పాన్‌షాప్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. రూ.15వేలు చోరీ జరిగినట్టు రమేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో క్లూస్‌టీం వచ్చి షాప్‌ను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లపు ఊటలు ధ్వంసం

వీరఘట్టం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగోర గ్రామంలో 8 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 1600 లీటర్ల బెల్లంఊటను ఎస్ఐ జి.కళానిధి ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు చెప్పారు.

ఆక్రమణలపై విచారణ

గరుగుబిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకాం రెవెన్యూ పరిధిలో పల్లపుబంద ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. ఈ నెల 22న ఆంధ్రజ్యోతిలో 'ఇది చెరువే!' శీర్షికన వెలువడిన కథనంపై తహసీల్దార్ పి.బాల స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌరీప్రసాద్‌తో పాటు వీఆర్వో, సర్వే సిబ్బంది శుక్రవారం చిలకాం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థుల నుంచి సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామని, నివేదికలను తగు చర్యలు నిమిత్తం అధికారులకు అందిస్తామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్‌వై నాయుడు, డర్రు సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వారు మాట్లాడారు. అక్టోబరు నెల జీతాలు నేటికీ కార్మికులకు చెల్లించలేదన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సత్యనారయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్ కార్డులు

మక్కువ, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ జాబ్‌కార్డులు అందిస్తున్నామని ఉపాధి హామీ ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ తెలిపారు. కన్నంపేటలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి జాబ్‌కార్డులో నమోదు చేస్తామని చెప్పారు. పని అడిగిన ప్రతిఒక్కరికీ సత్వరమే జాబ్‌కార్డు అందించేలా చర్యలు చేపట్టామన్నారు.

26న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

పాచిపెంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులను గుర్తించి అవసరమైన ఉపకరణాలు అందిస్తామని ఎంపీడీవో జీవీజే పాత్రో తెలిపారు. పాచిపెంట మండలంలో గల గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులందరూ ప్రసార మాధ్యమాల ద్వారా, దండోరా ద్వారా చాటింపు వేయాలని సూచించామన్నారు.

జీజే కళాశాలలో జాబ్‌మేళా

బెలగాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ మినీ జాబ్ మేళాకు 47 మంది హాజరు కాగా, ఉద్యోగాలకు 17 మంది ఎంపికయ్యారని చెప్పారు.

తీర్మానాన్ని ఉపసంహరించాలి

సీతంపేట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసన మండలిలో ప్రవేశపెట్టిన షైస్కూల్ పని గంటలను సాయంత్రం ఐదు గంటల వరకు మార్చిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్టీయూ, ఎంటీఎఫ్ సంఘాల నాయకులు ఆరిక భాస్కరరావు, పురుషోత్తం, కృష్ణారావు, ఆనందరావు డిమాండ్ చేశారు. శుక్రవారం దీనికి సంబంధించి ఒక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం ఈ ఆలోచనను పునరాలోచించాలన్నారు.